# శిశు విక్రయం

నెల రోజులనుంచీ పనికోసం తిరుగుతున్న మొగుడు పట్నం పొలిమేరలో నున్న పాకలో కాలుపెడుతూ "పని దొరికిం" దన్నాడు. పెళ్ళాళికి యెంత చల్లని కబురు! మొగుడు మాటలను పొడిగిస్తూ, "యాభై రూపాయలు లంచం యీయాళ పొద్దు తిరక్కముందు ఇస్తేనే" అన్నాడు. ఏభై రూపాయలు-అమ్మో, అంత డబ్బే!

ఆకలితో అలమటించి పోతున్న ముగ్గురు పిల్లల గోడు, తన అలమటింపు, నోటిలో చీకటిలో మంచినీరు పోసుకొని నిద్ర పోయిన రాత్రులు—ఈ హృదయ క్షోభే వుత్తేజితురాలను చేసి "చప్పున నే తెస్తానుండు" అని బిడ్డను చంకనెత్తుకొని బయలు దేరింది.

కొద్దిగా మీదకి వచ్చిన వేసవి సూర్యుడు అప్పుడే కోపంతో కూడిన చూపులను కురిపిస్తున్నాడు. నడుస్తూనే భుజంమీద బిడ్డను వేసుకొని నిమురుతూ మళ్ళీ మళ్ళీ అనుకుంది-"ఏభై రూపాయలు యింతే!"

ఎదురుగా కనిపించిన వీధి మేడల మయం. ముఖం తేజోవంతమైంది. ఉబుకుతున్న ఆశాతరంగాలతో మొదటి మేడ చేరగానే చేరవేసుంది తలుపు. "పిలిస్తే యేమనుకుంటారో? ఇంటిలో యే గొడవా లేదు. వీళ్ళకు పిల్లలు లేరేమో? నా బిడ్డ యిన్ని ఏభైలకు వారసు డౌతాడు!" పిలుస్తానని రెండో మెట్టుమీద కాలువేసే సరికి కయ్ మన్న యేడుపు వినిపించింది. తన బిడ్డయేడుపు కాదది. గబగబా మెట్లు దిగి మళ్ళీ వెనుకకు చూడలేదు.

బొడుగ్గా లావుగావున్న పక్కయింటి యజమాని నోటిలో సిగరెట్‌తో పైకి రాగానే ఆయనతో తన భర్త ఫేక్టరీలో కూలీలు హెచ్చయ్యారని నెలరోజుల క్రితం తొలగించిన రెండు వందల మందిలో ఒకడని, అప్పటినుంచి కుటుంబం పడుతున్న కష్టాలని మొదట చెప్పాలన్న వుబలాటంతో దగ్గరకు వెళ్తుండగానే ఆయన అణా మీదకు విసిరేసి లోనికి వెళ్ళిపోయాడు. ఎదరగా పడ్డ అణా వేపు తన బిడ్డవేపు పదే పదే చూసుకొని కదలినా ఆ అణా అయు

స్కాంతలా ఆమెను ఆకర్షిస్తోంది. పట్టుకుంది పారేసింది. నాలుగడుగులు వేసి "ఆ బాబు దయతో యిచ్చిహాడు. నేను అడుక్కోలేందే తీసుకోకపోతే పాపం."

చేత అణాతో ఆ ప్రక్కయింటిలో కస్సు బుస్సు లాడుకుంటున్న మొగుడు పెళ్ళాల వేపు చూసి "నా బిడ్డను పెంచటం చేతకాక పాడు చేస్తారు. నే నెప్పుడైనా చూడాలని వస్తే గుమ్మం యెక్కనివ్వరు. వద్దు వద్దు" ఈ మనసులో మాటలు మనసులోనే వున్నయ్. హఠాత్తుగా ఆ యింటావిడ "ముష్టి ముష్టి, వెధవ ముష్టి. గవర్నమెంటు ననాలి—అడుక్కోవటం లేకుండా శాసనం పెగంగా తగలడరాదూ?"

"అడుక్కోడానికి రాలేదమ్మా" తలెత్తకుండా అంటే మళ్ళీ వడగళ్ళవానలా "మరెందుకు తగలడ్డావ్ యిక్కడికి?" జవాబు తెలిసినా ప్రయత్నించినా చెప్ప లేని ప్రశ్న అయిపోయింది. వెనుతిరిగి పరుగునడకలతో రోడ్డువేపు నడచింది.

సంతకు మనుషులు రిక్షాలమీద బండ్లమీదను వెళ్ళిపోతున్నారు. నడిచేవాళ్ళు ఎండధాటుకి వడిగా నడిచిపోతున్నారు. నడుస్తూనే "బిడ్డ ఖరీదు యేభై రూపాయిలే-వక్క యేభై యే" గట్టిగా నలుగురికీ వినిపించేటట్లు అరుస్తున్నానని అనుకున్నా అరవలేకపోయింది. "ఎవడో పేదోడు-నాకంటే కొద్దిగున్నోడు కొంటే-నా బిడ్డ ఆకలితో చచ్చిపోదూ?"

అడుగులు జోరుగా వేస్తూ సంత బజారు చేరింది. ఎండంతా మరచిపోయి, మనుషులు కుప్పలు తిప్పలుగా బేరసారాల్లో మునిగి

పోయున్నారు. పిల్లల ఆటవస్తువులు "నాబాబు కొకటి ఆడుకోడానికుంటే!" తీపితీపి మిఠాయి- "నాబాబు నోటిలో బెడితే!" బజారు నడిబొడ్డున బట్టల దుకాణం చూడగానే ఒళ్ళంతా ఆశతో నిండిపోయింది. దుకాణదారుడు నిల్చునే పెద్ద గొంతుకతో అరుస్తూ చకచకా బేరం ముమ్మరంగా సాగిస్తున్నాడు. "మా బాబు ఏముకల్నికప్పాలి. మా బాబుకు సరిపడే జుబ్బా యెంతబాబూ!" అంది. వెంటనే నాలుగు రకాలు పైకెత్తి ధరలు, బట్టల నాణ్యాన్ని వర్ణిస్తూ యేకరువు పెట్టాడు. పదిహేను అణాలకు తక్కువ యేంలేదు. ఒకణా కాదు! పదిహేనణాలే!

జనం తోసుకపోతున్నారు. పక్కనే రొట్టెల దుకాణం—బిడ్డ ఆకలి తీర్చాలి ముందు. వున్న ఒక అణాపెట్టి ఒక చిన్న బన్నురొట్టెకొని, బట్టలదుకాణం వెనుకనే చిన్న కిరాణా దుకాణపు బడ్డీపక్కనే కొద్దిగా నీడవుంటే మెల్లగా వెళ్ళి బిడ్డను కూర్చో బెట్టి బన్ను చేత బట్టుకొని చిన్న మెత్తని ముక్కతీసి బిడ్డనోటిలో బెట్టింది. మిగిలినది మిగతా యిద్దరి పిల్లలకి. పాపడు చప్పరిస్తూ చిన్నబోసి నవ్వు వెదజల్లు తున్నాడు. సంత సందడి. దగ్గరే అరుస్తున్న బట్టల దుకాణదారుని ఉత్కంఠం ఏమీ తన మోదాన్ని చెదరగొట్టలేదు.

ఒక మూలనుంచి ఎగిరి చేతిలోని రొట్టెను కుక్క అందుకుంది. గుండె ఝల్లుమని గభాల్న లేచి కుక్క వెంట పరుగెత్తింది లేనిశక్తి కూడబెట్టుకొని, గంపెడాశతో బజారు దాటేవరకు మనుషులను తోసుకొని దుకాణాలను దాటుకొని వురికింది. కుక్క రోడ్డుమీద పడి జాగర్లు వేసుకొని పరుగెడ్తుంటే చేసేదిలేక బిడ్డ తలపుతో గబ

గబా వెనుకకు తిరిగి వచ్చింది. అంత దూరమునుంచే కొడుకు ఎర్రరంగు బుబ్బా పట్టుకొని ఒకచివర నోటిలో పెట్టి నమలడం చూసి చప్పున ఆగినా మళ్ళీ ఆలోచన తట్టడంచేత మెల్ల మెల్లగా వెళ్ళి బిడ్డ నెత్తుకొని చాటుచాటుగా యింకొకవేపు వెళ్ళిపోయింది

జుబ్బా! బంగురుతూ బట్టలకొట్టు మనిషి వెనకవేపున్న కుట్టిన రంగురంగుల బట్టలనుంచి యీ ఎర్రని జుబ్బా తీసుకొని వుంటాడు అమ్మకంలోపడి కొట్టుమనిషి చూచుకోలేదు. తన కోరుకున్నట్లే దేవుడిచ్చాడు! జుబ్బా తొడిగింది. కొద్దిగా పెద్దదే. అయినా తన బిడ్డ ఎముకల్ని కప్పిందిగా! యిప్పుడు తన పాప డెలా వున్నాడు? "ఒక్క యేభై యేమిటి? నాబాబు కెన్ని యేభైలైనా ఇవ్వవూ!" ఒక కొట్టుచాటున నిలుచుని ఒకే ముద్దు పెట్టుకొని యిటూ అటూ చూసింది. "ఎవరూ చూడలేదు కదా? ఆ కొట్టు వాడివేపు చూడడానికే అంత కటువుగా వున్నాడు. తలుచుకుంటేనే భయమేస్తోంది. అయినా వాడేం చేస్తాడు నాకు? నా బాబూ నేను జుబ్బా దొంగలాడ లేదుగా. నా బాబుని కొనుకున్న మారాజుకి జుబ్బాలేని బాబునే యిస్తాను. అప్పుడు జుబ్బా తీసికెళ్ళి కొట్టోడికి ఇచ్చేస్తాను. అంతలోనే కొట్టుబాబుకు కోప మొస్తే సెమించమని కాళ్ళుపట్టుకుంటాను."

ఇప్పుడు బిడ్డ అమ్మకానికి తగ్గట్లుగా నున్నాడు. నల్లని శరీరముపై ఎర్రని జుబ్బా, సన్ననికాళ్ళు చేతులు, కురిడీ బాంటు తలకాయ తప్పించి, ఎముకలపుట్ట నంతని జుబ్బా కప్పేసింది. ఎండ తీవ్రతకు ఒళ్ళంతా చెమటలు కక్కుతున్నాడు. ఇంకా ఆలస్యం చేయకుండా అమ్మేయాలి. కాబట్టి యెలా అమ్మాలో తెలియ

కుండా వుంది! బజారులో అన్నిటికీ, చివరకు తవుడుకు కూడా అంగడివుంది, కానీ పిల్లఅమ్మకానికి అంగడి లేదే!

చేతిలో బుట్టపట్టుకొని ఒక ఇల్లాలు ఎత్తి ఎత్తి అడుగులు వేసుకొని వస్తోంది. బంగారు వస్తువులు మెడను కప్పేస్తున్నాయ్, "అవును! యీయమ్మ చాలా మంచి మనిషిలా వున్నాది-" ఆత్రుతతో వెంటపడి "అమ్మా అమ్మా" అంది వెనుకకు ఒకసారి చూచి "యేమే" అంటూ ఆగిందా యిల్లాలు, పోమ్మనలేదు, "నిలబడి మరీ మాటాడిందీమె "నా బిడ్డను సరిగ్గా పోషిస్తాదీ యమ్మ." చప్పున "నా బిడ్డని అమ్మేస్తానమ్మా" అన్నాక యేదో మహానేరం చేసినట్లు ఒళ్ళంతా గజగజ వణికిపోయింది. ఆ యమ్మ వెనువెంటనే కదులుతూనే, ఖస్సుమంది. "నేను గొడ్రాలిని కానే—నాకూ వున్నారు పదిమంది!"

పేదరికం కళావిహీనం చేసినా ముఖం అవమానంతో మాడిపోయింది. మనుషుల్లో చాలా మంచివాళ్ళు అనుకునేవాళ్ళు అనుకుండగానే కదిలిపోతున్నారు. అందరినీ అడుగుతానని అడగలేకపోయింది. "యిదిగిదిగో, యీ బాబు ధర్మప్రభువులా వున్నారు. బాబూ, బాబూ!"

"ఏమే!"

యీ ప్రశ్నతో ఆగిన ఆ పెద్దమనిషి వేపు జరిగి "బాబూ! కలిగిన బాబులు, యీ బిడ్డని—"

"అమ్ముతావా?" యీ ఎదురు ప్రశ్న యెంత కటువుగా వున్నా ఆమెలో ఆశను రేకెత్తించటంచేత, ఔనన్నట్లుగ మౌనంగా తల ఆడించింది.

ఆ పెద్దమనిషి అమాంతంగా కోపంతో హుస్సుమని మీదికి వచ్చి "చెప్పు, నిజం చెప్పు. యీ బిడ్డ నీదా?"

జవాబు లేదు. గిర్రున నీరు కళ్ళల్లో తిరిగిపోగా బిడ్డను హృదయానికి గట్టిగా హత్తుకుంటూ ఎదుట నిల్చున్న మనిషి ముఖంలోనికి అసహ్యమన్నంతా కూడగట్టుకున్న కళ్ళతో మిటుకు మిటుకు మని చూస్తూ "నా బిడ్డ—నా బిడ్డకాదని ఎవరనగలరు?" గొణుక్కున్నది.

"నిజంగా నీ బిడ్డయితే అమ్మగలవా?" యీ ప్రశ్న వేసి చక్కగా పోయాడా పెద్దమనిషి. ఆకలితో అసలే పసలేని నరాలిప్పుడు తెగినట్లయినవి. ఆ దగ్గరగా మాంసం కొట్లచాటున కూర్చుండి పోయినా, వచ్చే పోయే మనుషులవేపు కళ్ళు ఆశతో చూస్తూనే వున్నాయ్.

అలా ప్రజల్లో ప్రస్ఫుటంగా కనిపించే ఒక ముఖం చూడగానే మళ్ళీ లేచిపోయింది. ఆ లావుపాటి మనిషి కట్టుకున్న సిల్కుబట్టలు పూర్తిగా చెమటతో తడిసిపోయున్నాయ్. చేతివ్రేళ్ళకు ఉంగరాలు అందరికీ చూపిస్తున్నట్లు, చాలా ధాటుగా ఒక్కొక్క అడుగు అరనిమిషానికి వేస్తూ మహాట్టహాసంగా నడుస్తున్నాడు. ఎండ తీవ్రంగా వుంది. క్రిక్కిరిసిన జనంతో సంత ముమ్మరంగా సాగిపోతోంది.

ఆమెనవెంట నాలుగడుగులు వేసింది. మనిషిది ముందు చూపే. "అన్ని వుంగరాలే! యేం విలవైన బట్టలు? మంచి బాబే.—ముఖమే సెప్తోంది. బిడ్డలులేని బాబులా వున్నాడు. నా బిడ్డను యీ బాబు పెద్ద చదువు సదివించి సర్కారులో పెద్ద నౌఖరీ యిప్ప

స్తాడు!" అంతు పంతు లేని ఆశాయుతమైన ఆలోచనలు ఆ నిమిషాల్లో అన్నిటినీ మరిచిపోనిచ్చినయ్ యీ ఆలోచనలతోనే కొద్దిగా ముందుకు వెళ్ళి "బాబూ, బాబూ, పెద్దబాబూ!"

ఆ దుబ్బులాంటి ముఖములోని లోతు కండ్లు ప్రక్కకు తిప్పకుండా నడక సాగిస్తున్నాడు. "తప్పు తనదే. అడగనిది అమ్మయినా, పెట్టదు. బాబుకు సెప్పందే!

"బాబూ, బాబూ. యీ బిడ్డను తీసుకొని యేభై రూపాయలిప్పించండి. ఒక్క యేభై య్యే బాబూ!"

నా బిడ్డే అని అన్నప్పుడు ఒక నేరస్తురాలిని పోల్చిన పోలీసులా చూశాడు.

"అంత మంచిబాబు. మనసులో కొనాలని వుండబట్టే మాటాడనేదు. యిలాంటి బాబుతో అన్ని కష్టాలు చెప్పుకుంటే కనికరం పుడతాది. నా బిడ్డను పెంచడానికి నన్ను సాయం చెయ్యమనడా?" ఆలోచనలు మాటలతో పాటు కాళ్ళుకూడా సాగిపోతున్నాయ్. క్షణ క్షణానికి మెదడునంతా ఆక్రమించుకున్నాయ్.

"బాబూ, మీ రిచ్చిన యేభైతో మా యజమానికి మళ్ళా వుద్యోగం దొరుకుతాది. నా పిల్లలిద్దరు మాము మీ పేరు చెప్పుకొని బతుకుతాం—" చిక్కిన శరీరంతో, చింకిబట్టలతో, చింపిరి జుట్టుతో నున్న యీ ఆడదానికి అక్కరలేదన్న సమాధానం యివ్వటానికి తన అమూల్యమైన మాటలువృథా అవుతాయనో, లేక తన తాహతు యిలాంటి వాళ్ళకు జవాబు యివ్వటానికి వప్పుకోదనో మౌనంగానే నడుస్తున్నాడు. యీ మౌనం అంగీకార మన్న ఆశతో అన్నీమరచి వెంటపడింది.

బజారు నడిబొడ్డు. ఆమెమీద పిడుగు పడ్డట్టయింది. వెను వెంటనే పురుముల్లా దొంగముండా అన్న అరుపులు, తిట్లు ఆమెను భీభత్సం చేశాయి. ఎవరో ఏమిటో చిందర వందర చేసేస్తున్నారు. ఎవరు? ఎవరు? తన చేతనుండగా తన బిడ్డ ఎముకలు విరిచేస్తున్న పాపిష్టి వెవడు? నలిగి కమిలిపోయిన బిడ్డగొంతుక చిట్లిపోయి నట్లు కయ్యిమన్న యేడుపు!

చింతనిప్పుల్లా కళ్ళెర్రజేసి హుంకరిస్తూ జనంలో వుగ్రంగా, చేతిలో తన కొడుకు రక్తం తడచిన జుబ్బాల యెర్రటి జుబ్బా పట్టుకొని, నరరూపంలో నున్న రాక్షసుని వలె కనిపిస్తున్నాడు— బట్టలకొట్టువాడు, ఆమె జుబ్బాను బేరమాడినట్లు తరవాత దొంగలాడి నట్లు విషయమంతా, మూగిన జనంతో చెప్తున్నాడు.

ఆమె చెవుడెక్కిన చెవులు, మంటెక్కిన కళ్ళు పట్టుతప్పిన కీళ్ళు అన్నీ కొన్ని క్షణాలవరకు సర్దుకోలేకపోయినయ్. అంత వరకూ యేడుస్తున్న బిడ్డను హృదయానికి హత్తుకున్న ఆమెచుట్టూ చేరి అరుస్తున్న గొంతుకులవేపు, ఆవేశంతో వున్న ముఖాల వేపు చూసింది. యేడవటానికి కన్నీరు లేవు. అరవటానికి గొంతుక చచ్చింది. ఆ అయోమయ అవస్థలో చుట్టూ గుమికూడిన అందరికీ, నిజం చెప్పాలనే ఆశ—తలో మాట అన్నాక అంటున్నారని ఆమె అనుకున్నా, కొడుకు యేడుపుతో అవి చెవికి హృదయానికి చేరక పోయినా చెప్పింది. "నా బిడ్డను అమ్మేక జుబ్బా యిచ్చేస్తానను కున్నాను బాబూ!"

"నీ బిడ్డా? గొడ్డులావుంది. కష్టపడ లేదూ? అమ్ముతా దమ్మ

తాది!" కొన్ని గొంతుకలు కటువుగా విసిరిన మాటలకు తల పగిలి పోయింది. ఎండ, ఎండ బ్రహ్మాండమైన యెండ!

"దీని పిల్లడు కాడేమో? చూస్తుంటే దీనివాటం మాయముం డలా వుంది!"— దాహం దాహం! గొంతుకదాటి గుండెలోని రక్తాన్ని తర్పేస్తోంది. "నా బాబు నా బాబు! నా బాబే-నెత్తి కొట్టుకుంటూ పొంగే దుఃఖంతో జనాన్ని చొచ్చుకొని పోయింది.

బజారు దాటిపోయింది. మళ్ళీ రోడ్డు. వుడికిపోతున్న తారు రోడ్డు. అవమానం ఒంటినిండా దిగ్గుట్టు పెట్టడంచేత రక్తం అట్టుడికి పోతోంది. బజారుబైట నడవాలనుకున్నా నడవలేక ఒక ఆగిన బండి చాటున కూర్చొని యేడుస్తున్న బిడ్డను లాలిస్తూ రోడ్డువేపు చూస్తోంది.

"అదిగో కుక్క! ఆ కుక్కే నా రొట్టెను తీసుకుపోయింది, అచ్చంగా అదే అదే! ఆ రొట్టెవుంటే నా బిడ్డ ఆకలి తీరునే. హాః— ఒంటిమీద రక్తం. యింత కంటె పెద్దకుక్క పోట్లాడి, కఱచి ఆ రొట్టెను తీసుకుందేమో! అయ్యో పాపం! నిజంగా తీసుకుపోయుం టుంది—" ఎదురుగా నున్న హోటల్ నుంచి ఎంగిలాకులు రోడ్డు ప్రక్కనున్న కుండిలో వేశారు. యీ కుక్క అటు పరుగెత్తింది.

అలా పోతున్న కారులోని వర్తకుడు సర్కారు నెలా పన్ను విషయంలో మోసం చేద్దామని ఆలోచిస్తున్నాడు. మధ్య తరగతి గుమాస్తా రిక్షామీద పోతూ నాకూ అలాంటి కారుంటే అని అనుకొని అది అసంభవమని తోచడంచేత అధమా యీ కాకీనిక్కరుబదులు, ఒక "పనామా పేంటు" వుంటే అనుకుంటున్నాడు— ఈ నెలలో ఒక్క మూడువందల రూపాయలే ఇంటికి మనియార్డరు చేయగలి

గానని ఎదరగానున్న దక్షిణాదినుంచి ఒంటిగా వచ్చిన హోటలు యజమాని విసుక్కుంటున్నాడు. అలాంటి సిల్కుచీర కొనమని ఒక భార్య భర్తతో జట్కాలో వెళ్ళిపోతూ, షో రూమ్‌వేపు చూపిస్తూ మారాం చేస్తోంది. యీ తల్లి ఆలోచిస్తోంది. "నేనూ ఆ కుక్కలతో చేరితే నా బిడ్డ చిన్ని కడుపుకి నాలుగు మెతుకులు దొరకవూ?"

ఫాక్టరీ బాకా రయ్‌మంది. మిట్ట మధ్యాహ్నం "యిక పొద్దు తిరుగుతుంది. వేగంగా యేభై ఆ బాబు సేత పెట్టితేనే, గాని ఆ కాళీలో యింకొకడు చేరతారు. యిప్పుడే అమ్మెయ్యాలి!

సంతబైట రోడ్డుకు ఆనుకున్న స్థలములో చిన్న పశువుల సంతదగ్గరకు చేరి అక్కడ చేతడబ్బుతో నిలుచున్న కసాయి వాళ్ళను చూసి ఆతృతతో అన్నది—"మీరు సాయం చెయ్యాలి!"

"సాయమా?" మోటుగా ప్రశ్నించాడొకడు,

"నాబిడ్డ నమ్మేస్తాను. ఒక్క యేభై యిప్పించండి."

అక్కడున్న వాళ్ళంతా పక పకా నవ్వుతున్నారు. కళ్ళల్లోనికి వేడి బొగర్లు కొడ్తున్నాయి. నిశ్చేష్టురాలై చూస్తోంది. మూత నిండా మీసాలతో మొరుడులా వున్న మనిషి చేతులుతిప్పుతూ అన్నాడు-"ఓ! కడుపుకు లేక బిడ్డనమ్ముతున్నావా? బలే తల్లివి. సిగ్గులేదూ? సూడు—ఆడికి ఐదుగురు, నాకు ఏడుగురు. మావుఁ యింటిల్లపాది ఒకోనాడు కూడులేక నిద్దరోతాం. కాని నీలా బిడ్డ నమ్మవేఁ!"

రోజూ పీకలనరికే మనిషే పిల్లలమీద ప్రేమ గురించి మాటాడుతున్నాడు. శక్తి దిగజారినా మళ్ళీ చివరి ప్రయత్నంగా,

"అన్నల్లారా! మీ కెవరైనా తెలిసినవాళ్ళుంటే యీ బిడ్డనుంచి యేభయి రూపాయ లిప్పించండి. మా యజమానికి నౌకరీఅయ్యేక బిడ్డ నిడిపించుకుంటాను.

"తాకట్టు", వెనువెంటనే ఒకడు వెర్రిగా నవ్వి "రోగంతో అసహ్యంగా నేడో రేపో చచ్చేనట్లున్నాడు. యే వెర్రోడు కొంటాడు వూరకనే యిచ్చినా ఎవడిక్కావాలి? ఆ ముఖం చూస్తేనే సెప్పొచ్చు-మోసగా డవుతాడని!"

మిగతా అందరూ ఒక్కసారిగా నవ్వారు. యీ మాటలంటున్నప్పుడు బిడ్డని గట్టిగా గుండెకు హత్తుకొని వాడి వేపు గుడ్లురచేసి చూస్తూ, "అలాగనటం నీకు నాయంగా వుందా?" నిరాశ అవమానంవల్ల నీరూరిపోతున్న కళ్ళు ప్రక్కకు తిప్పుకుంటూ గొంతుకెత్తి "నాబిడ్డ మోసగాడు కాదు-కాలేదు. రెండు రోజులు కడుపునిండా పెడితే అందరి పిల్లలకన్నా బాగుంటాడు."

పోతూనే ఆ డొక్కుపశువులవైపు చూసింది. అలావున్నా వాటికి విలువ వుంది. యిప్పుడింకేం గతి? అంతా యిక ఆకలితో చచ్చిపోవాలి! అందరూ కలిసి ఏ నుయ్యో గొయ్యో చూసుకుంటే!

సూర్యుడు మరీ వుగ్రుడై నిప్పులు కక్కుతున్నాడు. నడవలేక ఒక బియ్యపు కొట్టు ప్రక్కన ఖాళీషెడ్డులోనికి వెళ్ళి నిల్చుంది. తన యిల్లు యింకా మైలు దూరం! ఆకలి. ఆకలి. ఆశంతా చచ్చిపోయాక, ఆవేశమంతా కరిగిపోయాక-అకలి! తనకే అలాగుంటె తన బిడ్డకు? కూర్చుందా మని క్రిందకు చూసింది. చీమలపుట్ట. దొరికింది ఒక్కటే కాకుండా గుంపంతా పంచు కుంటున్నాయ్. ముచ్చటగా వాటివేపు చూస్తుండగా నే ఎండనకా వాననకా కష్టపడేవాళ్ళకు

కడుపునిండదా? తనూ మొగుడూ కష్టపడదామంటే కూలి లేదే! చటుక్కున ఆ ఉద్యోగం యిస్తామన్న బాబు జ్ఞాపకానికి రాగానే ఒక మెరుపు లాంటి ఆలోచన తట్టింది.

"హాఁ! యీ ప్రపంచకాన ఎవరు యేమూలున్నా యింకో మూల అల్లాంటి రెండు కళ్ళూ, రెండు చేతులూ, గుండెకాయ వున్న మాలాంటి పేదోలమీద కనికార ముండదా? మనిషికి మనిషి మీద దయ వుండకపోతే యీ ప్రపంచకం వుంటాదా? యెల్తాను- ఆ బాబు దగ్గిరికి, యీ బిడ్డల్ని సూసి కనికరించి నౌకరీలో యేస్తే జీపం అందగానే యేభై ముట్టచెప్పుకుంటానని బతిమాలు కుంటాను."

ఈ ఆలోచన యిదివరకు తట్టనందుకు నొచ్చుకుంది. "నాను బజారులో బెట్టి, నా బిడ్డను అమ్మడానికి వచ్చినానా? ఛా ఛా, యెలా గొచ్చినాను? గుండెలేని పని చేయబోయినాను! అందుకే అంతా అలాగు తిట్టారు, కొట్టారు. యీలంతా యెంత మంచోళ్ళు! బిడ్డ నమ్మకుండా చేసినారు. అమ్మేసే-మా ఆయన చిన్న బాబేడి అంటే యేం చెప్పేదాన్ని? అమ్మేసానంటే నన్ను బతకనిచ్చేవోడా? ఆ పెద్దబాబు తప్పక కనికరిస్తాడు. నా బిడ్డను నేనే ముద్దుగా పెంచుకుంటాను."

ఆశతో ఆకలిని మరిచిపోవటం ఆమెకు అలవాటై పోయింది నడుస్తోంది. కాళ్ళు మాడిపోతున్నాయ్. గబగబా పరుగునడకలతో తన ఆశాయుతమైన ఆవేశం నడిపిస్తోంది. చెమట వర్దల్లా పారుతుంటే, మాసిన జీర్ణవస్త్రం తడిసి, శల్యాలు తప్పించి యింకేమీ లేని శరీరానికి అంటుకు పోతోంది. బిడ్డ యేడుస్తూంటే ఆ యేడు

పును లక్ష్యం చేయకుండా యీ బిడ్డతో సహా అందరం హాయిగా బ్రతకొచ్చనే ఆలోచనతో అడుగులు జోరుగా పడుతున్నాయ్.

అబ్బా! తారురోడ్డు-కుతకుత వుడికి పోతున్న తారురోడ్డు. పాదాలు బొబ్బలెక్కి పోతున్నాయి. వడగాల్పులు విశాల ప్రదేశమునుంచి కొడ్తున్నాయి. లంచం అడిగిన మనిషి యే భయిరూపాయలు ఒక బ్రాందీబుడ్డికో, ఒక జవరాలు విషపునగవుకో విసరేవచ్చు. కానీ అలాంటి మనిషి మానవత్వంమీద ఆశే మట్టు టెండలో ఒంటిగా బుజంమీద బిడ్డను వేసుకొని ప్రయాణం చేయిస్తోంది.

ఆకలిగొన్న, వడగాల్పులు తిన్న బిడ్డ గొంతుక రాను రాను సన్నగిల్లుతూ చివరకు యేడవలేని పరిస్థితికి వచ్చింది. తన ఒంటిమీద బట్ట కప్పాలన్నా తనకు చాలనిదే—అయినా వక్షానికి బిడ్డను హత్తుకొని ఆ చింకిపమిటను కప్పుతూనే నడుస్తోంది.

వెర్రివేసవి. వేడి వేడి, బ్రహ్మాండమైన వేడి. ఎక్కడా ఒక చెట్టులేదు. ఒక పక్షి లేదు. ఒక మనిషి లేడు! మధ్యాహ్నపు టెండారిలా వుంది. ఆకలికి యేడవటం తప్పించి యీ నరజాతి, ఆశనిరాశ దురాశల ఫలితాలు, ఆరాట అవమానాల బాధలు ఆ బిడ్డకేం తెలుసు? ఆకలితో ఆటమటించి వడగాల్పులకు తట్టుకోలేని బిడ్డ బెక్కుతూ తలకాయ వంచుతోంది. తల్లి చేతినుండి జారిపోతోంది.

పరుగునడకలను సాగిస్తూ తల్లి నడుస్తూనే బిడ్డను కొద్దిగా పైకెత్తుతూ చూసింది. బీభత్సంగా యిటూ అటూ చూచినా యెక్కడా యేక్కడా యేమీలేదు. యేనాడో ఎండిపోయిన ఆమె వక్షంమీద చెమటధారలు చెక్కిళ్ళనుంచి జారుతూ పడుతున్నాయి

"నా బాబూ, నా బాబూ" అంటూనే నాలుగడుగులు తత్తరపడుతూ యిటూ అటూ వేసింది, నీరు—నీరైనా అదుగో కొళాయి పరుగెత్తింది. నీరులేదని తెలిసినా నొక్కుతోంది చుట్టూ ఒక నీటిచుక్క లేకుండా ఎండ ఎప్పుడో ఆర్చేసింది. నా బిడ్డకు నీరో అని గట్టిగా అరచినా ఆ అరప ఎంతదూరమూ పోలేదు. పోయే దూరములో యిళ్ళేమీ లేవు. కడుపులో నుండగా తొమ్మిదినెలలు రక్షించ గలిగిన యీమె నిస్సహాయురాలై, బిడ్డ ఒళ్ళంతా గాభరాగా తడిమేస్తూ ఎండకు అడ్డుగా, వేడిగాలికి వీపిచ్చి కూర్చొని ఒడిలో వేసుకుంది. తల్లి నుదిటినుండి కారే చెమటైనా బిడ్డనోటిలో పడలేదు. మళ్ళా చటుక్కున లేచి తనపాకే దగ్గరగా నున్నట్లనిపించటంచేత అటు దౌడుతీసింది. నీరో అన్న కేకలతో అలసిపోతూ జాగిపోతూ మిగిలిన శక్తినంతా కూడగట్టుకొని పరుగెత్తుతోంది.

అంతదూరంలో నుండగానే ఎదురు చూస్తున్న భర్త చూశాడు. కేకలు విని చెంబుతో నీరు పట్టుకొని ముందుకురికాడు. మిగతా యిద్దరు పిల్లలు వెంట పడ్డారు. భర్త భార్య నోటిదగ్గరకు చెంబును పెడుతుంటే సొమ్మసిల్లినట్లుగా క్రిందకు దిగజారుతూ "పోయ్యి" అని అరచింది. మొగుడు గాభరా పడ్డాడు. ఒక యినపపెట్టెలో గుప్తంగా దాచిపెట్టిన ఖరీదైన ముత్యముల బిడ్డను పమిట నుంచి బైటకు తీస్తూనే మళ్ళీ అరచింది. తల వంచిన భర్త గజగజ వణికిపోతున్నాడు. నిలబెట్టిన కళ్ళతో అలా భర్తముఖంలోకి చూస్తూనే కోపం దుఃఖం రెండూ కక్కుతూ—"చెవుడా? పిచ్చా? నా బిడ్డనోటిలో నీరు పొయ్యవూ?" భర్త చేతిలో చెంబు జారి నేల పడటం ఆమెకు జ్ఞప్తికి లేదు.

చివరకు బిడ్డను చావుకు అమ్మేసింది!